సాక్షి వికారాబాద్

శుక్రవారం । 28 । జూన్ । 2024



పడకేసిన పశువైద్యం

గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. సకాలంలో వైద్యం అందక జీవాలు మృత్యువాత పడుతున్నాయి. 8లో▸



ఇసుకను తోడేస్తున్నారు

ప్రభుత్వ పనుల కోసం అధికారులు ఇసుక తరలింపునకు ఇస్తున్న అనుమతులు అక్రమార్కులకు వరంగా మారింది. 8లో▸



సారును బదిలీ చేయొద్దు

తమ పిల్లల భవిష్యత్‌కు బాటలు వేస్తున్న హెచ్‌ఎంను బదిలీ చేయరాదని విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓను కోరారు. 8లో▸

న్యూస్‌రీల్

సేవా దృక్పథం ఉండాలి

- 108 ప్రోగ్రాం జిల్లా మేనేజరు శ్రీకాంత్



సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీకాంత్

మోమిన్‌పేట: ప్రమాదం జరిగిన సమయంలో.. ఆపదలో ఉన్న వారు 108కు కాల్ చేస్తే తక్షణం స్పందించాలని 108 ప్రోగ్రాం జిల్లా మేనేజరు శ్రీకాంత్ వాహన సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలో 108, 102 వాహనాలను తనిఖీ చేశారు. సిబ్బంది సేవా దృక్పథంతో పని చేయాలన్నారు. ఫోన్ వస్తే జాప్యం చేయరాదన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందేలా చూస్తే ప్రాణాలను కాపాడిన వారమవుతామని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులు, పాము, కుక్క కాటు, గర్భిణులు ఎక్కువగా 108కు కాల్ చేస్తుంటారని తెలిపారు. అలాంటి వారికి తక్షణసాయం అందేలా చూడాలన్నారు.

ప్రజా ఉద్యమాలకు విద్యార్థి సంఘాలే కీలకం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ



మాట్లాడుతున్న మల్లికార్జున్ మాదిగ

తాండూరు టౌన్: ప్రజా ఉద్యమాలకు విద్యార్థి సంఘాలే కీలకమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు. గురువారం తాండూరులో నిర్వహించిన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సంఘాలు నిరంతరం పోరాటం చేయాలన్నారు. మాదిగ, ఉప కులాల హక్కుల పరిరక్షణ, ఆత్మగౌరవం, సమాన అవకాశాల కోసం మాదిగ దండోరా ఉద్యమం ప్రారంభమైందన్నారు. ఎన్నో పోరాటాలతో అణగారిన వర్గాలకు అండగా నిలిచిందన్నారు. 30 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఉద్యమానికి గుర్తుగా జూలై 7న వరంగల్‌లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలాది మందితో నిర్వహించనున్న చలో వరంగల్ కార్యక్రమానికి మాదిగ విద్యార్థులందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎంఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ అజయ్, ఉమాశంకర్, రామ్, నవీన్, పరుశురాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీ' మాయని మచ్చ



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

అనంతగిరి: ఎమర్జెన్సీ మాయని మచ్చ.. ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో 1975 జూన్ 25 ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అనే అంశంపై పార్టీ నాయకులతో చర్చ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎమర్జెన్సీ విధించిన రోజు కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ కార్యకర్తలను జైలులో వేసి చిత్ర హింసలకు గురిచేసిందన్నారు. ప్రధాని మోదీ దేశ పురోగతికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, జిల్లా ఉపాధ్యక్షులు నందు, రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి సతీష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిరీష, నాయకులు శాంతకుమార్, భద్రేశ్వర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును పరిశీలించిన జేడీ



కొడంగల్: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డును గురువారం మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మ హర్ష పరిశీలించారు. యార్డు విస్తరణ, అభివృద్ధి పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది.

వరుణజపం



వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపులు

- విత్తు వేసిన రైతన్నకు తీవ్ర నష్టం
- సీజన్ దాటినా 29 శాతమే సాగు
- జిల్లాలో సాగు అంచనా 5.90లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకు పూర్తయ్యింది 1.69లక్షల ఎకరాలే
- చిరు జల్లులతోనే సరిపెడుతున్న వరుణుడు



గొట్టిముక్ల గ్రామంలో వర్షాల కోసం పూజలు చేస్తున్న అన్నదాతలు

వికారాబాద్: వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా రైతన్న ఇంకా ఆకాశం కేసి చూడాల్సి వస్తోంది. వరుణుడి కోసం 20 రోజులుగా ఎదురుచూస్తున్నారు. సాగుకు సరిపడా వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా మేఘాలు ఊరిస్తున్నా చిరుజల్లులకే పరిమితమవుతోంది. ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5.90లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయశాఖ అంచనా వేసింది. 60 మిల్లీమీటర్ల మేర రెండు మూడు వర్షాలు కురిస్తే తప్ప విత్తనాలు వేసుకునేందుకు అవకాశం ఉండదు. ఇప్పటి దాకా రెండు మూడు మండలాల్లో మినహా ఇతర చోట్ల తగినంత వర్షపాతం నమోదు కాలేదు. పూర్తిస్థాయిలో వర్షాలు పడిన తరువాతే విత్తనాలు వేయడం మంచిదని అధికారులు పేర్కొంటున్నారు. సగం విత్తనాలు రైతుల ఇళ్లల్లో ఉండగా.. సగం మట్టిలో పోసి వరుణుడి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఎండిపోతున్న మొలకలు

సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు కురిస్తే రోహిణి లేదా మృగశిర కార్తెలో విత్తనం వేస్తారు. ఈ ఏడాది రోహిణి కార్తె వెళ్లి నెల రోజులైంది. ఇప్పటికీ కేవలం జిల్లాలో 29శాతం విత్తనాలే వేశారు. ఇంకా 71శాతం విత్తనాలు ఇళ్లలోనే ఉండిపోయాయి. పెసర, మినుము, జొన్న విత్తుకోకపోవడమే మేలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 5.90లక్షల ఎకరాల్లో వానాకాలం పంటలు సాగు కానుండగా ఇప్పటి వరకు కేవలం 1.69లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తుకోవడం పూర్తయ్యిందని తెలిపారు. ఓ పక్క మేఘాలు ఊరిస్తున్నప్పటికీ విత్తుకు సరిపడా మాత్రం కురవడం లేదు. ధైర్యం చేసి కొందరు విత్తనాలు వేశారు. కొన్ని చోట్ల విత్తనాలు మొలకెత్తాక ఎండిపోయాయి. మరికొన్ని చోట్ల మొలకలు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి సాగు పెరిగే అవకాశం

జిల్లాలో 16 రకాల పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పత్తి, కంది, మొక్కజొన్న, వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చని అంచనా వేశారు. గతేడాది క్వింటాలు పత్తికి రూ. 8వేలకు పైగా వచ్చింది. దీంతో ఈ సారి కూడా పత్తి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2.5లక్షల ఎకరాలు కాగా.. ఈ ఏడాది అంతకుమించి సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వరి, కంది పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కోతులు బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూరగాయలు, వేరుశెనగ సాగు తగ్గవచ్చని పేర్కొన్నారు.



ధారూరులో వర్షాల కోసం కర్రకు కప్పను కట్టి ఊరేగింపు నిర్వహిస్తున్న రైతులు

పెసర, మినుము వద్దు


సీజన్ ఆరంభం నుంచే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు దాడులు నిర్వహించాం. రైతులకు కూడా అవగాహన కల్పించాం. లోటు వర్షపాతం కారణంగా 29 శాతం విత్తనాలే పూర్తయ్యాయి. ఈ నెలాఖరు వరకు అన్ని రకాల విత్తనాలు వేసుకోవచ్చు. ఈ నెల దాటితే పెసర, మినుము, జొన్న పంటలు సాగు చేయకపోవడమే మంచిది. నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– గోపాల్, డీఏఓ

ఆహ్లాదకర వాతావరణంలో బోధన జరగాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ఆహ్లాదకర వాతావరణంలో బోధన జరగాలని, అప్పుడే పిల్లలు బాగా చదువుకుంటారని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌ను, ప్రాథమిక పాఠశాలను, శివారెడ్డిపేట్‌లోని యూపీఎస్ ఉర్దూ మీడియం స్కూల్‌ని, యెన్నెపల్లిలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం-1ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పరిసరాలు బాగుండి, సరైన రీతిలో బోధన జరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు ఇంగ్లిష్‌లో రాయడం, చదవడం నేర్పించాలని సూచించారు. అనంతరం పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులకు ఎంత మేర నిధులు విడుదలయ్యాయి.. పనుల పురోగతిపై ఆరా తీశారు. పెండింగ్ పనులను తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఎంఈఓ బాబుసింగ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, యునూష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



శివారెడ్డిపేట్ పాఠశాలలో నీటి వసతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి
- జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి
- ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ఆమనగల్లు: విత్తనాలు, ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి హెచ్చరించారు. రైతులు పొలాల్లో తేమ ఉన్నప్పుడే విత్తనాలు నాటుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని వివిధ ఎరువుల షాపులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో ఉన్న స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. గోదాముల్లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. వానాకాలం పంటలకు సంబంధించి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించి రసీదులు విధిగా ఇవ్వాలని ఆదేశించారు. డీలర్లు ఈ పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. రోజువారీగా ఈపాస్‌ద్వారా అమ్మిన స్టాకును తీసివేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆమె సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని జంగారెడ్డిపల్లి సమీపంలో ఆమె రైతులతో మాట్లాడి ఏ రకం పత్తి విత్తనాలు వేస్తున్నారు.. ఎలా విత్తుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. కొరత ఉన్న కొన్ని రకాల పత్తి విత్తనాల విషయంలో ఆందోళన చెందొద్దని, అధీకృత డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న విత్తనాలను ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరమెవరికో!

మహా నగరం నుంచి మంత్రి అయ్యేదెవరో!!

- త్వరలో రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ
- ఆశావహుల్లో మల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దానం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జంట జిల్లాల నుంచి ఎవరికి మంత్రి పదవి దక్కుతుందన్నది అటు రాజకీయ వర్గాల్లోనే కాక ఇటు సాధారణ ప్రజల్లోనూ ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు దాదాపుగా నగరంలోనే కలగలిసి ఉండటంతో ఈ జిల్లాల నుంచి ఎవరిని మంత్రి పదవి వరించినా వారిని మహానగరానికి ప్రాతినిధ్యం వహించే వారుగానే పరిగణించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండు జిల్లాల నుంచి ఎవరికీ మంత్రి పదవి లభించలేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వచ్చే 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి ఏ ఒక్కరు కూడా ఎమ్మెల్యేగా గెలవలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ముగ్గురు గెలవగా వారిలో గడ్డం ప్రసాద్‌కుమార్‌కు స్పీకర్ పదవి ఇచ్చారు. దీంతో మిగతా ఇద్దరు ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి తమకు మంత్రి పదవి లభించనుందనే ఆశతో ఉన్నారు.

ఒకరికి ఖాయం?

రెండు జిల్లాల నుంచి ఎవరూ లేకపోవడంతో ఒకరికి ఖాయంగా లభించనుందని రాజకీయ పరిశీలకులు కూడా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ సైతం మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. బహుశా ఆ ఆశతోనే ఆయన సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు తొలుత ససేమిరా అన్నప్పటికీ, పోటీ చేయక తప్పలేదు. బీఆర్ఎస్ డిమాండ్ చేసినా ఎమ్మెల్యే పదవికి రాజీనామా కూడా చేయలేదు. ఎంపీ ఎన్నికలో ఆయన ఓడిపోయినప్పటికీ, బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరిన ఆయనకు మంత్రి పదవి లభించవచ్చని భావిస్తున్న వారు ఉన్నారు. దానం హైదరాబాద్ జిల్లాలోని ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. హైదరాబాద్ జిల్లాకే మంత్రి పదవి ఇవ్వాలని భావించే పక్షంలో ఆయనకు, జంట జిల్లాలనుంచి ఎవరో ఒకరికి ఇవ్వాలని భావిస్తే మల్‌రెడ్డి రంగారెడ్డి లేదా రామ్మోహన్‌రెడ్డిలలో ఎవరో ఒకరికి మంత్రి పదవి లభించనుంది. ఎంతో కాలం జంట జిల్లాలుగా కొనసాగిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం లేని మంత్రివర్గమంటూ కూడా ఎప్పుడూ లేదు. అంతేకాదు.. జంట జిల్లాల నుంచి ఒకే మంత్రివర్గంలోనే ముగ్గురికి కూడా మంత్రి పదవులు లభించిన సందర్భాలు కూడా ఉన్నాయి.



మల్‌రెడ్డి రంగారెడ్డి రామ్మోహన్‌రెడ్డి దానం నాగేందర్

చట్టాలపై అవగాహన తప్పనిసరి

యాచారం: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు, గృహ హింస, బాలల చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా, బలవంతం, బెదిరింపులకు గురి చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. దోపిడీలకు పాల్పడడం, వ్యభిచారం, అవయవ వ్యాపారం, లైంగిక దోపిడీ, బలవంతపు శ్రమ, బానిసత్వం, అవమానించడం వంటి విషయాలపై చట్టాలు కఠినంగా ఉన్నాయని వివరించారు. సమావేశంలో నక్కర్తమేడిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు మొరుగు శివలీల, గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్, మాజీ సర్పంచులు బోడ కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, ప్యారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

'గ్యారంటీ'ల అమలే ప్రభుత్వ లక్ష్యం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



నవాబుపేట: కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, నాయకులు

నవాబుపేట: ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. నవాబుపేట మండల కేంద్రంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ మాట్లాడుతూ.. ముందు చూపు లేకుండా వ్యవహరించిన గత ప్రభుత్వం తీరుతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. ఆగస్టు 15 వరకు ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. మహిళలకు రూ.2,500 పెన్షన్ పథకాన్ని సైతం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒక దళితుడికి స్పీకర్ పదవి ఇవ్వడం గొప్ప విషయమని, కాంగ్రెస్ పార్టీతోనే ఇలాంటివి సాధ్యమని తెలిపారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా వాసి కావడంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచన మేరకు ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పులుసుమామిడి, ఆర్కతల గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మూసీ, ఈసీ వాగులపై బిడ్జీలు నిర్మించనున్నట్లు తెలిపారు.

ప్రొటోకాల్ రగడ

అధికారులు కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా మారి ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీ కాంగ్రెస్ కార్యకర్తల కార్యక్రమంలా ఉందని ఎద్దేవా చేశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ మొదటి సారి నవాబుపేటకు వస్తుండటంతో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, కానీ ఇలాంటి పరిస్థితి వస్తదని అనుకోలేదని అసహనం వ్యక్తం చూస్తూ వేదిక నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నించారు.. స్పీకర్.. ఎమ్మెల్యేను సముదాయించారు. ఇక్కడ ఉన్న నాయకులంతా ఇది వరకు జరిగిన ఎన్నికల్లో మీకు ఓట్లు వేసిన వారేనని.. అందుకే మీరు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. నాలుగో సారి కూడా ఎమ్మెల్యే కావాలంటే చిన్నచిన్న విషయాలను పట్టించుకోరాదని యాదయ్యకు సూచించారు. దీంతో ఆయన శాంతించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జ్ భీంభరత్, ఆర్డీఓ వాసు, తహసీల్దార్ జయరాం, ఎంపీడీఓ అనురాధ, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు వెంకటయ్య, నాగిరెడ్డి, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ప్రభాకర్, ఆనంద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొండల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తాం

మోమిన్‌పేట: ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మోమిన్‌పేట రైతు వేదికలో 41మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరిట హామీ ఇచ్చామని, ఇప్పటికే రెండు పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో రైతు రుణమాఫీ అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి హామీని అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.220 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.210 కోట్లు, సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.150 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పాలన అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత పాలనను గాడిలో పెట్టి.. అభివృద్ధిపై దృష్టి సారించామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.1,00,116 అందజేస్తున్నామని, ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి నగదుతో పాటు తులం బంగారం లేదా అందుకు సమానమైన నగదును అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు బాగ్దాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తంరెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్, వేమారెడ్డి, మహంత్ స్వామి, బాబు, చంద్రయ్య, సిరాజొద్దీన్, ఎజాస్ పటేల్, మాణయ్య, జనార్దన్ రెడ్డి, లాయక్ అలి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్టి తవ్వకాలు నిలిపేశాం

తహసీల్దార్ తారాసింగ్



పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని రాపూర్ గ్రామ శివారులో పట్టా భూమిలో మట్టి (మొరం) తవ్వకాలను నిలిపివేశామని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. గురువారం సాయంత్రం గ్రామశివారులో మట్టి తవ్వకాల ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రాంపూర్ సమీపంలోని సర్వేనంబర్ 9లో వ్యవసాయ పొలంలో మట్టి తవ్వకాలకు రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు. ఇప్పటి వరకు తవ్విన మట్టి తవ్వకాలపై ఆర్డీఓకు నివేదిక ఇస్తామన్నారు. మైనింగ్ అధికారుల నుంచి కూడా అనుమతి లేదని చెప్పారు. పొలం యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట ఆర్ఐ బాల్‌రాజ్ ఉన్నారు.

బాధితులకు సొమ్ము అప్పగింత

ధారూరు: తనఖా పెట్టిన నగలతో ఉడాయించిన బంగారం షాపు వ్యాపారి ఎట్టకేలకు బాధితులకు తమ సొమ్మును అప్పగించాడు. గురువారం స్థానికంగా వ్యాపారి దీపక్ 64 మంది కస్టమర్లకు బంగారు నగలను అందజేశారు. మరో 15 మందికి ఇవ్వాల్సి ఉంది. వారికి శుక్రవారం ఇస్తానని వ్యాపారి తెలిపారు.

యథేచ్ఛగా తోడేస్తున్న ఇసుకాసురులు

ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవడానికి అధికారులు దండకాన్ని ప్రదర్శిస్తున్నా.. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో అది విఫలం అవుతుంది. నిత్యం అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవడం.. పైరవీల మాటును వదిలేయడం అధికారగణానికి అలవాటుగా మారింది.

అనుమతుల పేరిట అక్రమ రవాణా

- కేసులు నమోదవుతున్న అక్రమార్కుల్లో చలనం కరువు
- ప్రజాప్రతినిధుల ఒత్తిడితో అధికారులు సతమతం



యాలాల: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

యాలాల: ప్రభుత్వ పనులకు కాగ్నా నది నుంచి ఇసుక తరలింపునకు రెవెన్యూ అధికారులు ఇస్తున్న అనుమతులు.. అక్రమార్కుల పాలిట వరంలా మారుతున్నాయి. అనుమతులు లేకున్నా.. ఉన్నాయంటూ దబాయిస్తూ కాగ్నా నదిని కొల్లగొడుతున్నారు. గతంలో రాత్రివేళ కొనసాగిన ఇసుక అక్రమ రవాణా ఇప్పుడు దర్జాగా పట్టపగలే కొనసాగుతుంది. ఈ విషయంలో ఎవరైన అధికారి వాహనాన్ని పట్టుకుంటే చాలు.. సదరు అధికారికి ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే ఫోన్లతో దిక్కుతోచని పరిస్థితిని అధికారులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు గురువారం కాగ్నా నది సమీపంలో ఇటువంటి సంఘటన చోటు చేసుకుంది.

నాయకుల నుంచి ఫోన్ కాల్స్ వెల్లువ

మండలంలోని కోకట్ పంచాయతీ పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుకాల నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకుగాను యాలాల రెవెన్యూ అధికారులు సుమారు 20 ట్రాక్టర్లకు గత మూడు రోజులుగా బెన్నూరు శివారు కాగ్నా నది నుంచి ఇసుక తరలించేందుకు అనుమతులు జారీ చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరలింపునకు అవకాశం ఇచ్చారు. అయితే బెన్నూరు కాగ్నా నదిలో అనుమతులు పొందిన ట్రాక్టర్లతో పాటు అనుమతులు లేని ట్రాక్టర్లే దర్జాగా ఇసుక అక్రమ రవాణా చేసుకుంటున్నాయి. అదే సమయంలో రూరల్ సీఐ ఇసుక ట్రాక్టర్ల అనుమతి పత్రాలను తనిఖీ చేయగా, అనుమతులు లేని చాలా ట్రాక్టర్లు ఉన్నట్లు అధికారి గుర్తించారు. కాగా ఇసుక ట్రాక్టర్ల వ్యవహారం రెవెన్యూ, పోలీసు అధికారులకు తలనొప్పిగా మారింది. అనుమతులు లేని ట్రాక్టర్ల వారికి ప్రశ్నిస్తే సదరు అధికారికి ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్ కాల్స్ వెల్లువలా వస్తుంటాయి. దీంతో పట్టుకున్న ట్రాక్టర్లను అక్కడే వదిలేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

భారీగా డంప్‌లు!

కాగా ఇసుక అనుమతులు లేని ట్రాక్టర్లతో దర్జాగా కాగ్నా నదిని కొల్లగొట్టిన అక్రమార్కులు భారీగా డంప్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వర్షాలు ప్రారంభమయితే కాగ్నా నదిలో నీరు రావడంతో ఇసుక తరలింపునకు అవకాశం ఉండదు కాబట్టి భారీగా డంప్‌లు ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. అనంతరం డంప్ చేసిన ఇసుకను దర్జాగా విక్రయించుకొని లాభాలు పొందుతున్నారు.

తూతూమంత్రంగా జరిమానాలు

మండలంలో పట్టుబడుతున్న వాహనాలకు అధికారులు నామమాత్రంగా జరిమానాలు విధిస్తుండటం చర్చకు దారి తీస్తుంది. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో అధికారులు తక్కువ మొత్తంలో పట్టుబడిన వాహనాలకు జరిమానాలు విధిస్తున్నారు. మూడు రోజుల క్రితం ఓ గ్రామానికి చెందిన ఐదు ట్రాక్టర్లు.. కాగ్నా నదిలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా రూరల్ సీఐ ఆధ్వర్యంలో పరిశోధన విభాగం పోలీసులు పట్టుకొని పీఎస్‌కు తరలించారు. సదరు వాహనాలకు రెవెన్యూ అధికారులు రూ.పదివేలు జరిమాన విధించి వాహన యజమానులను బైండోవర్ చేయాలని భావించారు. అయితే ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఒత్తిడితో ఒక్కో ట్రాక్టరుకు రూ.5వేల నామ మాత్రపు జరిమానా విధించారు.

"కఠిన చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే చాలా వాహనాలపై కేసులతో పాటు డ్రైవర్లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశాం. అక్రమార్కుల్లో మార్పు రాకుంటే కఠిన చర్యలకు వెనుకాడం.

– విఠల్‌రెడ్డి, ఎస్ఐ, యాలాల

ఇష్టానుసారంగా తవ్వుకుంటూ



కుల్కచర్ల: ఘట్టుపల్లిలో కృత్రిమ ఇసుక నిల్వలు

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కొన్ని గ్రామాల్లో ఇసుక రవాణాను పోలీసులు నివారిస్తున్నా మరికొన్ని గ్రామాల్లో మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. మండల పరిధిలోని రాంపూర్, కుస్మసముద్రం గ్రామ శివారులో ఉన్న వాగులోంచి కొందరు ఇసుకను ఇష్టానుసారంగా తవ్వుకుంటూ కాసులు దండుకుంటున్నారు. ఘట్టుపల్లి, అనంతసాగర్, అల్మాస్‌ఖాన్‌పేట్ వాగులలో సైతం ఇసుకకు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాను నిర్మూలించాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు



కుస్మసముద్రం, ఘట్టుపల్లి గ్రామాలలో ఇసుక డంపులు ఉన్నాయని తమ దృష్టికి వచ్చింది వాటిని సీజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను నిల్వ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– మురళీధర్, తహసీల్దార్, కుల్కచర్ల

బీడీల కోసమని వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మల్లప్ప మృతదేహం

పరిగి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ మండలం సంగాయపల్లి గ్రామానికి చెందిన మల్లప్ప(55) కుటుంబంతో కలిసి గడిసింగాపూర్ గ్రామ సమీపంలోని మామిడితోటలో కూలి పని చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం మల్లప్ప బీడీల కోసమని గ్రామానికి నడుచుకుంటూ వెళ్లి తిరిగొస్తున్నారు. ఆ సమయంలో ఇబ్రహీంపూర్ గ్రామం నుంచి కొడంగల్ వెళ్తున్న బైక్ మల్లప్పను వెనుకనుంచి ఢీకొట్టడంతో ఆయన తలకు బలమైన గాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మల్లప్ప మృతికి కారణమైన వాహనదారుడిపై మృతుడి కూతురు మంజుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనాలు ఢీ

ఒకరికి తీవ్ర గాయాలు

మోమిన్‌పేట: కారు, బైకు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామానికి చెందిన మాల గోపాల్ బైకుపై మోమిన్‌పేటకు వస్తున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన తెలుగు నారాయణ కారులో మోమిన్‌పేట నుంచి మొరంగపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో సూపర్ డీలక్స్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నారు. దీంతో గోపాల్‌కు బలమైన గాయం కావడంతో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

నిర్మాణాలకు మేటి 'భారతి'



తాపీ మేస్త్రీలకు బాండ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ సంస్థ ప్రతినిధులు

- అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో వేగంగా పనులు
- సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్
- తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్ల అందజేత

అనంతగిరి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్.. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ అన్నారు. వికారాబాద్ సమీపంలోని మద్గుల్ చిట్టంపల్లె వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వర డీలర్ షాప్‌లో గురువారం తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభిస్తున్న ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని స్పష్టంచేశారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు అల్ట్రాఫాస్ట్ సరైన ఎంపిక అని వివరించారు.

ఉచిత సాంకేతిక సాయం..

అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని, స్లాబ్ కాంక్రీట్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని చెప్పారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ బ్యాగుకు 20 రూపాయలు అధికంగా ఉంటుందని తెలిపారు. అనంతరం యాభై మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ వెంకటేశ్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉందన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ బృందం ప్రతినిధులు రాజేశ్వర్‌రెడ్డి, వీరాంజనేయరెడ్డి, టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 నమూనా పరీక్ష

అనంతగిరి: గ్రూప్-2 అభ్యర్థులకు నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరు కావాలనుకునే ఆసక్తిగల వారు దరఖాస్తులను టీజీ బీసీ స్టడీసర్కిల్ వెబ్‌సైట్‌లో వచ్చే నెల 5లోగా సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178లో సంప్రదించాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఆయా దుకాణాల్లో వినియోగిస్తున్న 56 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను పట్టుకున్నామని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. ఈమేరకు గురువారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, పర్యావరణ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు వ్యాపార సముదాయాల్లో నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పట్టుకుని వ్యాపారస్తులకు రూ.1200 చొప్పున జరిమానా విధించా రు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

బొంరాస్‌పేట: మండలంలోని మేడిచెట్టు తండాలో బుధవారం రాత్రి ఓ ఇంట ఎదుట పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని దుండగలు ఎత్తుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. బాధితుడు లక్ష్మణ్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉమ్మడి బొంరాస్‌పేట మండల పరిధిలోని హకీంపేట, దుద్యాల, తుంకిమెట్ల గ్రామాల్లోని నిఘానేత్రాలు సీసీ కెమెరాల్లో తనిఖీలు చేస్తున్నామని ఎస్ఐ ఎండీ రవూఫ్ పాషా తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మా సారును బదిలీ చేయొద్దు

డీఈఓకు విద్యార్థుల తల్లిదండ్రుల వినతిపత్రం



డీఈఓ రేణుకాదేవికి వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు

కుల్కచర్ల: విద్యార్థుల భవితకు బాసటగా నిలుస్తున్న ఆ ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేయకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారులు సంకల్పించారు. మండలంలోని సందనిగడ్డ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌ను తమ పాఠశాలలోనే ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ అబీబ్‌అహ్మద్‌కు బదిలీ చేయకుండా నిలుపుదల చేయాలని కోరగా తమ పరిధిలో లేదని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓ రేణుకాదేవి వద్దకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌ను బదిలీ ప్రక్రియ నుంచి మినహాయించాలని వేడుకున్నారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాస్, అంజి, చిన్నవెంకటేష్, రత్నం, శ్రీనివాస్, శ్రీనివాస్, రవి, భీమయ్య, అంజి, మహేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో కుష్టువ్యాధి నివారణ

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రాయాదవ్



వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

బొంరాస్‌పేట: కుష్టు, బోధకాల వ్యాధిని తగిన జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణంగా నిర్మూలించవచ్చని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రవీంద్రాయాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మండలంలోని కుష్టు వ్యాధి, బోధకాల వ్యాధిగ్రస్తులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోగాలపై జాగ్రత్తలు ఎప్పటికప్పుడు అవసరం అన్నారు. వానాకాలంలో సీజన్ అనారోగ్య సమస్యలు పొంచి ఉన్నాయని అప్రమత్తం చేశారు. బోధకాల వ్యాధిగ్రస్తులకు సబ్బులు, బకెట్లు ఇతర సామగ్రి అందజేశారు. ఈ సమావేశంలో డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ శిరీశ, మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్, సీహెచ్‌ఓ శివరాజ్, ఆయుష్మ ఫార్మసిస్టుల సుదర్శన్, సూపర్‌వైజర్ మణిమాల, హెచ్‌ఈ రాజేశ్వరీ ఉన్నారు.

ఎవరి బెంచీలు వారే తెచ్చుకోండి!



బెంచీలు మోసుకెళ్తున్న బాలికలు

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బెంచీలు మోసిన విద్యార్థినులు



బల్లలను తరలిస్తున్న విద్యార్థినులు

తాండూరు టౌన్: కళాశాలలో విద్యనభ్యసించడానికి వచ్చిన బాలికలతో బెంచీలు మోయించడం స్థానికంగా చర్చనీయాంశం అయింది. గురువారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్త భవనంలో తరగతులు నిర్వహించేందుకు ప్రిన్సిపాల్ సిద్ధమయ్యారు. ఇందుకు పాత భవనంలో ఉన్న బెంచీలు, కుర్చీలను కొత్త భవనంలోకి తరలించేందుకు ఎవరూ లేకపోవడంతో విద్యార్థినులు చెమటోడ్చారు. బెంచీలను భుజాన మోస్తూ దాదాపు 200 మీటర్ల దూరంలో ఉన్న నూతన భవనంలోకి తీసుకెళ్లారు. ఇది చూసిన స్థానికులు బాలికలతో బెంచీలు మోయించడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ రాజ్ మోహన్‌ను వివరణ కోరగా.. కాలేజీ నిర్వహణకు నిధులు లేవన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బాలికల సాయాన్ని తీసుకున్నామని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

తాండూరు టౌన్: తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వివేక్ కుమార్ దూబే గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, తెలుగు, వాణిజ్యశాస్త్రం, రాజనీతి శాస్త్రం, గణిత శాస్త్రం, జంతుశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్‌లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందన్నారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం పీజీ మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, బోధన అనుభవం కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన వారు జూలై 1వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజారాం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు-1, ఎకనామిక్స్-1, పొలిటికల్ సైన్స్-1, కామర్స్-2, జువాలజీ-1, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్-1 పోస్టులకు సంబంధించి అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 4గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యాలయ సిబ్బందికి దరఖాస్తులను అందించాలని తెలిపారు.

పరిగిలో..

పరిగి: పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయరాం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, గణితశాస్త్రంలో ఖాళీలు ఉన్నాయన్నారు. పీజీ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈ నెల 29వ తేదిలోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97017 74143గల నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

పడకేసిన పశువైద్యం



పశువులకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారిణి

- సకాలంలో చికిత్స అందక మూగజీవాల మృత్యువాత
- పశువుల బీమా లేక నష్టపోతున్న రైతులు
- శిథిలావస్థలో పశువైద్యశాలలు

దౌల్తాబాద్: గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయి. సకాలంలో చికిత్సకు అవసరమయ్యే ఔషధాలు వెటర్నరీ ఆస్పత్రుల్లో లేక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు, పశుకాపరులు తీవ్రంగా నష్టపోతున్నారు. దౌల్తాబాద్ మండలంలో గత ప్రభుత్వ హయాంలో సరిపడా మందుల సరఫరా జరగలేదు. ప్రస్తుతం పశువులను చికిత్స నిమిత్తం పశు వైద్యశాలలకు తీసుకెళ్లగా అక్కడ మందులు లేవు. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో తెచ్చుకోవాలని పశు వైద్యులు చిట్టీలు రాసి ఇస్తున్నారు. దీంతో రూ.వేలల్లో ఖర్చు అవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. దానికితోడు పశువులు మృత్యువాత పడుతుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరువైన స్పందన

మండలంలో 33 గ్రామాలుండగా దౌల్తాబాద్, గోకఫసల్‌వాద్ గ్రామాల్లో పశువైద్యశాలలు, బాలంపేట, నీటూరు గ్రామాల్లో సబ్‌సెంటర్లు ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లోని రైతులు పశువులను మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంగా ఉన్న వైద్యశాలకు తీసుకెళ్లాలి. అన్ని గ్రామాల్లో పశువైద్యాధికారుల లెక్కల ప్రకారం దాదాపు 12,320 వేల పాడి పశువులు, 38,747 వేల జీవాలు ఉన్నాయి. పశువులు, గ్రామాల సంఖ్యకు సరిపడా ఆస్పత్రులు, సిబ్బంది లేరు. ఉన్నవాటికి పక్కాభవనాలు లేవు. ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన కరువైంది. ఇటీవల మండలంలో దాదాపు 15 వరకు మూగజీవాలు వైద్యం అందక మృతిచెందాయి.

పశువుల బీమాకు మంగళం

ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పశువుల బీమా పథకం మాత్రం 2016 సంవత్సరం వరకు కొనసాగింది. అప్పటి నుంచి ఇన్సూరెన్స్ అందక రైతులు నష్టపోతున్నారు. పశువుల బీమా మళ్లీ అమలు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. మండలంలో జీవాలకు సీజనల్ వ్యాధుల చికిత్స కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. బడ్జెట్‌ను రెండింతలు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్, చల్లాపూర్, కుదురుమళ్ల, బిచ్చాల గ్రామాల్లో ఆస్పత్రులను నిర్మించాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు కోరుతున్నారు. ప్రస్తుతం నాలుగు పశువుల ఆస్పత్రుల్లో రెండింటికి పక్కా భవనాలు లేవు. ఉన్న దౌల్తాబాద్, గోకఫసల్‌వాద్ ఆస్పత్రుల్లో ఇరుకుగా శిథిలావస్థలో ఉంది. ఇప్పటికైనా సమస్యలు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

"వైద్యం అందడం లేదు



మా బిచ్చాల గ్రామం నుంచి దౌల్తాబాద్‌కు సుమారు ఆరు కిలోమీటర్లు. ఇటు బాలంపేట నాలుగు కిలోమీటర్లు. దీంతో సకాలంలో పశువులకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. అధికారులకు విన్నవించినా ఫలితంలేదు. ఇప్పటికైనా స్థానికంగా ఆస్పత్రులను నిర్మించాలి.

– భగవంతు, రైతు, బిచ్చాల

ఉన్నతాధికారులకు విన్నవించాం



గత ప్రభుత్వం నుంచి పశు బీమా పథకం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే నాలుగే ఆస్పత్రులు ఉండడం సిబ్బంది కూడా తక్కువగా ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఇన్‌చార్జిలతో కొనసాగిస్తూ రైతులకు సేవలందిస్తున్నాం.

– హథిరాం, పశువైద్యాధికారి, దౌల్తాబాద్